క్లుప్తంగా

ఎమ్మెల్యే కన్నబాబును కలసిన వైద్య విభాగం నాయకులు



ఎమ్మెల్యే కన్నబాబుకు బ్రోచర్ అందజేస్తున్న అశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ మురళీకృష్ణ

కాకినాడ రూరల్: రమణయ్యపేట క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ యనమదల మురళీకృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబుకు రాష్ట్రం, జిల్లాలో తమ విభాగం చేపడుతున్న కార్యక్రమాలను వారు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు యాళ్ల సుబ్బారావు, నురుకుర్తి రామకృష్ణ, ఎలిశెట్టి అమృతనరేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపునకు నేడు తుది గడువు

• రేపటి నుంచి రెండు శాతం వడ్డీ

కాకినాడ: ప్రస్తుత 2023–24 మొదటి అర్థ సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును జూన్ 30వ తేదీలోపు వడ్డీ లేకుండా చెల్లించవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల చెప్పారు. ఒకటో తేదీ తరువాత చెల్లించే బకాయిలకు 2 శాతం వడ్డీ పడుతుందన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించాల్సిన ప్రజలు శుక్రవారం సాయంత్రంలోపు పన్ను చెల్లించాలని సూచించారు. ఆయా సచివాలయాల్లోను, నగరపాలక సంస్థ కార్యాలయాల వద్ద పన్నులు స్వీకరిస్తారని కమిషనర్ మహేష్‌కుమార్ చెప్పారు.

భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు



నూతన ఉత్సవ కమిటీతో మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

పెద్దాపురం: ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా 9 మంది నూతన ఉత్సవ కమిటీ సభ్యులతో కలసి గురువారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో నూతన కమిటీకి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. తొలుత ఇన్‌చార్జి ఆర్డీఓ సత్యనారాయణ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు గురువారం కొంగోడు గ్రామంలో మాజీఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి 'భవిష్యత్‌కు గ్యారెంటీ' నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి వస్తున్నా మీగ్రామానికి, మీ అనంతలక్ష్మి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పార్టీ క్యాడర్‌తో రచ్చబండ నిర్వహించారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ప్రయాణికులు 73827 81490 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలిపాలని కోరారు.

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జి.సత్యనారాయణ గురువారం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

• ఆలయాలకు పోటెత్తిన భక్తులు
• ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు



మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



సర్పవరం భావనారాయణస్వామికి దశ హారతులు ఇస్తున్న అర్చకుడు



ప్రత్యేక అలంకరణలో కరపలోని వేణుగోపాలస్వామివారు

కరప: స్థానిక విష్ణ్వాలయంలో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ వడ్డాది సత్తిబాబు భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. యండమూరులోని వెంటేశ్వరస్వామి ఆలయంలో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వార్లకు, కొంగోడులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో, పెనుగుదురు, జెడ్.భావారం, కూరాడ తదితర గ్రామాల్లోని విష్ణ్వాలయాల్లోను పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నగరంలోని పలు ఆలయాల్లో..

బోట్‌క్లబ్: నగరంలో పలు ఆలయాల్లో గురువారం తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు పొందూరు రామకృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేశారు. మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామివారిని ఆలయ అర్చకులు మాధవచార్యులు ఆధ్వర్యంలో అనంత శయన రంగనాథస్వామిగా అలంకరించారు. స్థానిక భానులింగేశ్వరస్వామి ఆలయంలో, గాంధీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, వెంకట్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలోను, జగన్నాథపురం వేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు నగరంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అశోక్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

భావనారాయణునికి దశ హారతులు

కాకినాడ రూరల్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఏకాదశి దశ హారతులు గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు తొలుత ప్రత్యేక పూజలు చేసి రాత్రి 8 గంటలకు దశ హారతులు నిర్వహించి ఒకొక్కటిగా సుమారు గంటపాటు స్వామివారికి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణమూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చీడిగలోని దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయం, సర్పవరం జంక్షన్, ఆర్టీసీ కాలనీ తదితర గ్రామాల్లో ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శనాలు చేసుకున్నారు. చీడిగ ఆలయంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ దంపతులు, ఎంపీపీ గోపిశెట్టి పద్మజ బాబ్జీ దంపతులు దర్శనం చేసుకున్నారు.

ఘనంగా గజ్జె పూజ

కాకినాడ రూరల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ శివాలయంలో శ్రీలయ స్కూల్ ఆఫ్ క్లాసికల్ డాన్స్ ఆధ్వర్యంలో గజ్జె పూజ నిర్వహించారు. గురువు శ్రీనివాస్ పర్యవేక్షణలో కూచిపూడి నృత్య విద్యార్థులు కె.జోషిత, సీహెచ్ సాయిసిరి, శాంతి, నిహారిక, మహి, హేమశ్రీ పూజలో పాల్గొన్నారు.



గజ్జె పూజలో పాల్గొన్న నృత్య విద్యార్థులు

దానం, త్యాగాలకు ప్రతీక బక్రీద్



ముస్లింలకు బోధ చేస్తున్న మత పెద్ద

• ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
• భక్తిశ్రద్ధలతో మసీదుల్లో ప్రార్థనలు



ఈద్గా మైదానంలో మాట్లాడుతున్న ఖాజీ గౌస్ మోహిద్దీన్, పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: దానగుణం, త్యాగానికి బక్రీద్ ప్రతీక అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఈద్గా మైదానంలో గురువారం బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మస్జిద్–ఎ–ఆజం ఇమాం, ప్రభుత్వ ఖాజీ గౌస్ మోహిద్దీన్ ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. కాకినాడ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ హితం కోసం మహ్మద్ ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగ నిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ దానం, సాయం, త్యాగాలను ప్రతిబింబిస్తుందన్నారు. తన హయాంలో కాకినాడలో రెండు కొత్త మసీదులను నిర్మించినట్టు చెప్పారు. నూతనంగా ఈద్గా మైదానంలోని మసీదు స్థానంలో నూతన మస్జిద్ నిర్మాణానికి ముందుకు వచ్చిన ముస్లిం ప్రముఖులను అభినందించారు. ఈ సందర్భంగా యుసీసీ చట్టాన్ని ఉపసంహరించుకునేలా ముఖ్యమంత్రి ద్వారా ఒత్తిడి తీసుకురావాలని ముస్లింలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఇమామ్ గౌస్ మోహిద్దీన్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి సత్కరించారు. నమాజ్ అనంతరం ఎమ్మెల్యే ద్వారంపూడి ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, నూరాని చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు లతీఫ్‌ఖాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, మైనార్టీసెల్ అధ్యక్షుడు ఖాలీద్‌బిన్‌వలీ, పార్లమెంట్ జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు బాషా, నాయకులు పాల్గొన్నారు.

గృహ సారథుల మండల ఇన్‌చార్జిలు వీరే

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కేంద్ర పార్టీ మండల కన్వీనర్లను నియమించారు. కాకినాడ సిటి నియోజవర్గంలో 4వ డివిజన్ నుంచి 13 డివిజన్‌కు సుంకర విద్యాసాగర్, 14 నుంచి 26 డివిజన్ వరకూ జగన్నాథ విజయ్‌కుమార్, 27 నుంచి 37 డివిజన్ వరకూ రాగిరెడ్డి సుబ్బారావు, 38 నుంచి 46 డివిజన్ (42వ డివిజన్ మినహా) వరకూ కోరుమిల్లి బాలప్రసాద్ నియమితులయ్యారు. అలాగే కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రూరల్ మండలానికి గీసాల శ్రీనివాసరావును, కరప మండలానికి కాదా వెంకటేశ్వరరావును, 1, 2, 3, 42 డివిజన్లకు వడ్డి మణికుమార్‌ను, 47, 48, 49, 50 డివిజన్లకు కడియాల చినబాబును నియమించారు.

సార్వాకు సమాయత్తం

• కరప మండలంలో 14 వేల ఎకరాల్లో వరిసాగు
• నారుమళ్ల తయారీలో రైతుల నిమగ్నం



వాకాడ సమీపంలో నారుమడి తయారీకి ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



వలసపాకలలో సార్వా సాగుకు నారు పెంచడానికి విత్తనాలు చల్లుతున్న అన్నదాత

కరప: పంట కాలువలకు నీరు వస్తుండడంతో రైతులు కోటి ఆశలతో ఖరీఫ్‌సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఈ నెల ఒకటో తేదీనే కాలువలకు నీరు వదిలినా మండలంలోని కాలువలకు నీరు రావడానికి పదిరోజులు ఆలస్యమైంది. నైరుతి రుతు పవనాలు మొండికేయడంతో ఎండలకు నారుమళ్లు దెబ్బ తింటాయని రైతులు తొలకరి పనులు చేయడానికి ముందుకు రాలేదు. అల్పపీడన ప్రభావంతో రెండు రోజులు ఆకాశం మబ్బుపట్టి, అడపా తడపా వర్షాలు పడుతుండటంతో నారుమళ్లు వేసుకోవడానికి రైతులు చొరవ చూపుతున్నారు. మండల పరిధిలో తొలకరి పంటకు సుమారుగా 14,350 ఎకరాలు సాగుచేస్తుంటారు. సార్వాలో ముందస్తు సాగు చేపట్టాలని దానివల్ల పంట చివరిలో నవంబరులో వచ్చే తుపాన్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని జూన్ 1వ తేదీన కాలువలకు నీరు వదిలారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం, సాగునీరు సక్రమంగా రాక నారుమళ్లు పోసుకోవడానికి ఆలస్యమైందని రైతులు అంటున్నారు. మండలంలోని భూములన్నీ కాలువలకు శివారున, సముద్రతీరాన ఉంటాయి. మిగిలిన ప్రాంతాలవారితో పోలిస్తే వారం, పదిరోజులు ఆలస్యమవుతుంది. అయితే కాలువలకు నీరు వచ్చిన ప్రాంతాల్లో నారుమళ్లు వేసుకోవడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. మడుల్లోకి నీరు మళ్లించి, దమ్ముచేసి, నారుమళ్లు తయారుచేసుకోవడానికి రైతులు ఉపక్రమిస్తున్నారు. కాలువలకు మొగలో ఉన్న రైతులు నారుమళ్లు తయారుచేసుకోవడంలో ఇప్పటికే చురుగ్గా ఉన్నారు. అలాగే కొంతమంది రైతులు వెదజల్లు పద్ధతిని అనుసరించేందుకు అనువుగా ఉన్న పొలాలకు నీరుమళ్లించి దమ్ములు చేసుకుంటున్నారు. గతంలో ఎదురైన చేదు అనుభవాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని, సాగు మెళకువలు అనుసరించేందుకు ముందస్తు ఆలోచనలతో రైతులు నారుమళ్లు తయారు చేస్తున్నారు. శివారు ప్రాంత రైతులు మెరకభూముల్లో నీరెక్కకపోవడంతో గుల్లలతో, ఇంజిన్లతో సాగునీరు తోడుకుని, నారుమళ్ల తయారీకి దమ్ము చేసి, చదును చేసుకోవడంలో తలమునకలై ఉన్నారు. ఈ యేడాది వాతావరణం అనుకూలించి, ప్రకృతి వైపరీత్యాల నుంచి గట్టెక్కించి, తొలకరిపంట ఇంటికి చేర్చాలని అన్నదాతలు భగవంతునిపై భారంవేసి సార్వా సాగుకు సమాయత్తం అవుతున్నారు.

ఎండలకు ఆలస్యం చేశాం



కాలువలకు ఈనెల ఒకటో తేదీన నీరు వదలినా, ఎండలు ఎక్కువగా కాస్తుండడంతో నారుమడి దెబ్బ తింటోందని ఆలస్యంగా పనులు ప్రారంభించాం. రెండు రోజులుగా వాతావరణం చల్లబడడంతో తొలకరి నారుమడి వేసుకోవడానికి వీలుగా నీరు తోడి, దమ్ముచేయించి పనులు చేసుకుంటున్నాం.

– పెంకే అప్పన్న, కౌలురైతు, కరప..

తొలకరి పంటపైనే ఆశలు



12 కుంచాల సొంత భూమి ఉంది. మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నా. గత యేడాది కోత సమయంలో వర్షాలు పడటంతో నష్టపోయాం. ఈ యేడాది వాతావరం అనుకూలించి, పంటలు బాగా పండాలని, భగవంతునిపై భారంవేసి, నారుమడి వేస్తున్నాం. మృగశిర కార్తెలో ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల ఆలస్యం చేశాం.

– సూరంపూడి వెంకటేశ్వరరావు, కౌలురైతు, వలసపాకల

వైభవంగా సాయిబాబా ఆలయ రజతోత్సవాలు



హంస వాహనంపై బాబాను ఊరేగిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలోని సాయిబాబా ఆలయ రజతోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభయమ్యాయి. ఉదయం కాకడ హారతి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయినాథ హోమం నిర్వహించారు. సాయంత్రం బాబాను హంసవాహనంపై ఊరేగించారు. అయ్యప్పస్వామి ఆలయం నుంచి భానుగుడి మీదుగా శ్రీరామ్‌నగర్ వీధుల్లో ఊరేగింపు సాగింది. మహిళలు కోలాటం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

బాలికల భద్రతపై అవగాహన సదస్సు

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ దిశ వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఓ చర్చిలో బాలికల భద్రతపై అవగాహన సదస్సు జరిగింది. కాకినాడ పాతబస్టాండు ప్రాంతంలో జెహోవా షమ్మా ప్రార్థనా మందిరంలో పాస్టర్ కనుమూరి మోజెస్ బ్రెన్‌హం పర్యవేక్షణలో ఈ సదస్సును నిర్వహించారు. దిశ వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ఆర్.శైలజ ఆధ్వర్యంలో ఏఎస్ఐ చంద్ర, కేస్ వర్కర్ కె.ప్రవీణ మాట్లాడుతూ బాలికల భద్రతపై పలు సూచనలు ఇచ్చారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ను వివరించారు. బాలికలు, మహిళల భద్రత కోసం ఏర్పాటైన చట్టాలపై అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు గురైతే దాచుకోకుండా తక్షణమే తల్లిదండ్రులకు తెలియచేయాలని సూచించారు. సమాజంలో బాలికలు, స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలను వివరిస్తూ తమను తాము రక్షించుకునేందుకు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం దిశ భద్రత పోస్టర్‌ను పిల్లలతో కలసి సిబ్బంది ప్రదర్శించారు. ఈ సదస్సులో దిశ ఐటీ వింగ్ దుర్గాదేవి సహా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



బాలికలతో కలసి దిశ అవగాహన పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వన్ స్టాప్ సెంటర్ బృందం

వృద్ధులకు దుస్తుల పంపిణీ

కాకినాడ రూరల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొని తొలి ఏకాదశి ప్రాశస్త్యాన్ని వివరించారు.

చెత్తశుద్ధి సగమేనా!



ఎంపీడీఓ కార్యాలయం బయట పేరుకున్న చెత్త(పాతది)



ఎంపీడీఓ కార్యాలయం బయట సగమే శుభ్రం చేసిన దృశ్యం

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రహారీగోడకు ఆవల చెత్త, చెదారం పేరుకుపోయింది. ఈ కార్యాలయం పక్కనే 8 గ్రామాలకు సురక్షిత నీరందించే సామూహిక రక్షిత పథకం తాగునీటి చెరువు, మరో పక్క మండల విద్యావనరుల కేంద్రం, భవిత కేంద్రాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు వెళ్లేవారు చెత్తను చూసి అధికారుల తీరుపై ఇదేమి చెత్త శుద్ధి అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమస్యపై ఈ నెల 21వ తేదీన సాక్షి దినపత్రికలో 'మండల అభివృద్ధికి అంకురార్పరణ జరిగేదిక్కడే' అనే శీర్షికన కథనం వెలువడింది. వెంటనే అధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయం ప్రహారీ పక్కన ఉండే చెట్ల ఆకులను, తుడిపించి శుభ్రం చేయించారు. ప్రహరీ పక్కన ఉండే సిమెంట్ స్తంభాలు, ఇనుపతీగ అలాగే వదిలేసి సగమే శుభ్రం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంఈఓ కార్యాలయానికి వెళ్లే ప్రదేశాన్ని పూర్తిగా శుభ్రంచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

జలజలా సాగునీరు..

• న్యూ భీమన్నకర్ర కాలువ పనులు పూర్తి
• హర్షం వ్యక్తం చేస్తున్న శివారు రైతులు

సాక్షి ఇంపాక్ట్

కరప: ఎట్టకేలకు అధికారులు స్పందించి న్యూ భీమన్న కర్రకాలువ కింద నుంచి ఉండే మురుగు కాలువ తూములు సరిచేయడంతో సాగునీరు జలజలా ప్రవహిస్తోంది. కరప శివారు రామకంచిరాజునగర్ కాలనీ సమీపంలో న్యూ భీమన్న కర్రకాలువ కింద నుంచి తూముల ద్వారా మురుగు కాలువలోని నీరు శహపురం డ్రెయిన్‌లో కలుస్తోంది. మురుగుకాలువలోని నీరు వెళ్లేందుకు కొత్త తూములు వేసేందుకు కర్ర కాలువను తవ్వి, అసంపూర్తిగా వదిలేయడంతో న్యూభీమన్న కర్రకాలువలో నీరురాక శివారు భూములకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో ఈ నెల 26న 'నీరు లేక సార్వా ఆలస్యం' అనే శీర్షికన వెలువడిన కథనం పాఠకులకు విదితమే. ఇరిగేషన్ అధికారులు స్పందించి మురుగుకాలువలోని నీరు వెళ్లేలా తూములు సరిచేసి, మంగళ, బుధవారాల్లో పనులు పూర్తిచేశారు. దీంతో సాగునీరువస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



తూమును సరిచేయడంతో న్యూభీమన్నకర్ర కాలువలో ప్రవహిస్తున్న నీరు